క్లుప్తంగా

ఆక్రమణలు తొలగించాలి



కొల్లిపాడు వద్ద ఆక్రమణకు గురైన వంశధార కాలువ

వజ్రపుకొత్తూరు రూరల్: వంశధార కాలువ అభివృద్ధి పనులు చేపట్టడంతోపాటు ఆక్రమణలను తొలగించి శివారు ఆయకట్టు భూములకు సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నారు. కొంతమంది కాలువలను సైతం ఆక్రమిస్తుండడంతో సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయని వాపోతున్నారు. ఆక్రమణలతోపాటు కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో శివారు భూములకు సానీరు అందని పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. వంశధార 60 ఆర్ఎల్ కాలువ పక్కన ఉన్న కొంత మంది కాలువను కబ్జా చేయడంతో ఈ పరిస్థితి నెలకొందంటున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయాలి



మాట్లాడుతున్న నారాయణరావు

కంచిలి: ఎస్సీ, ఎస్టీ చట్టాన్ని బలోపేతం చేయాలని బహుజన సమాజ్‌వాదీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణరావు కోరారు. ఈ మేరకు కంచిలిలోని సామాజిక భవనంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ 1989 యాక్టును నిర్వీర్యం చేశారన్నారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులు అధికమయ్యాయని ఆరోపించారు. సబ్‌ప్లాన్ నిధులు విడుదల చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు శంబాన రామారావు, రుక్మాంగధరరావు, ఇప్పిలి గంగారావు, బాలరాజు, బడియా నాగేశ్వరరావు, పందిరి లోకేష్ పాల్గొన్నారు.

నేటినుంచి కౌలు రైతుల గుర్తింపు సభలు

టెక్కలి: కౌలు రైతుల గుర్తింపు కోసం గ్రామ సభలను సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్టు మండల వ్యవసాయాధికారి కెం.రంగారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. భూయజమానుల వద్ద పంట సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట సాగు పత్రాలను అందజేసి తద్వారా రైతు సంక్షేమ పథకాలను అందజేయడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా కౌలు రైతుల గుర్తింపు పత్రాలను అందజేస్తోందన్నారు. సోమవారం నుంచి ఈ నెల 28 వరకు మండలంలో 17 రైతు భరోసా కేంద్రాల పరిధిలో గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 19న గూడేం, నరసింగపల్లి, 20న అయోధ్యపురం, బూరగాం, 21న అక్కవరం, కె.కొత్తూరు, 22న లింగాలవలస, పోలవరం, 23న మేఘవరం, తిర్లంగి, 24న పాతనౌపడ, తలగాం, 26న రావివలస, టెక్కలి-4, 27న టెక్కలి-2, భగవాన్‌పురం, 28న పెద్దసాన ఆర్‌బీకేల పరిధిలో గ్రామ సభలు నిర్వహించనున్నారు.

శ్రేయా మిశ్రోకు కళాశ్రీ జ్యోతి అవార్డు

పాతపట్నం: భువనేశ్వర్ (ఒడిశా)లోని రవీంద్ర మండప్‌లో ఆదివారం జరిగిన అంతర్జాతీయ సంగీత నృత్య సంబరాల కార్యక్రమంలో పాల్గొని నృత్యప్రదర్శన చేసిన పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయా మిశ్రో (దివ్యాంగురాలు) కళాశ్రీ జ్యోతి అవార్డు అందుకుంది. భరతనాట్యం, కూచిపూడి, జానపదం విభాగాల్లో పలువురు నృత్యప్రదర్శన పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో శ్రేయామిశ్రో చేసిన నృత్య ప్రదర్శన (ప్లేట్ డాన్స్) అందర్నీ ఆకట్టుకుంది. నిర్వాహకులు డాక్టర్ ఉపేంద్ర నాయక్ శర్మ చేతుల మీదుగా అవార్డు, మెమొంటో అందించారు. ఉషోదయ కూచిపూడి కళానికేతన్ నాట్య గురువు అర్చన ఉషశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

• ఆర్థికసాయం..



కన్ను కురిమికి సాయం అందజేస్తున్న దృశ్యం

కవిటి మండలం పెద్ద ఎర్రగోవిందపుట్టుగ గ్రామానికి చెందిన నిరుపేద మహిళ కన్ను కురిమి కిడ్నీ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలియడంతో కొత్తపుట్టుగ కేంద్రంగా పని చేస్తున్న జైహింద్ ఫౌండేషన్ సేవాసంస్థ రూ. ఆరు వేలు సమకూర్చింది. ఈ మొత్తాన్ని బాధితురాలికి ఆదివారం అందజేశారు. సేవాసంస్థ చేస్తున్న సామాజిక సేవలను మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ కొనియాడారు.

– కవిటి

• ఆత్మీయ సమ్మేళనం..

వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి ఉన్నత పాఠశాలలో 1992–93 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులంతా ఆదే పాఠశాల వేదికగా ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా ఒకేచోట కలుసుకొని మురిసిపోయారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. విద్య నేర్పిన 15 మంది గురువులను దుశ్శాలువలతో సత్కరించి గౌరవించారు. గ్రూపు ఫొటోలతో సందడి చేశారు. పూర్వ విద్యార్థులు అట్టాడ గోవిందరావు, పిన్నింటి జయరాం, పి.కూర్మారావు, గణేష్, లక్ష్మీప్రసన్న, సునీత, పద్మజ తదితరులున్నారు.

– వజ్రపుకొత్తూరు



ఒకే వేదికపై కలుసుకున్న పూర్వ విద్యార్థులు

• చేపలవేట..



కుత్తుం గ్రామ కోనేరు చెరువులో చేపలు వేట సాగిస్తున్న దృశ్యం

మండుతున్న ఎండను లెక్క చేయకుండా కుత్తుం గ్రామస్తులు ఆదివారం చేపల వేట కొనసాగించారు. భానుడు భగభగ మండిపోతున్నప్పటికీ చేప కూర తినాలనే సంకల్పంతో చిన్నా..పెద్దా అనే తారతమ్యం లేకుండా గ్రామంలోని కోనేరు చెరువులో దిగి చేపల వేట సాగించారు. పోటాపోటీగా సాగిన వేటలో దొరికిన చేపలను తీసుకొని ఇంటిబాట పట్టారు. హాయిగా కూర చేసికొని తిని కోరికను నెరవేర్చుకున్నారు.

– కంచిలి

పీపీఎల్ విజేత చింతల పోలమ్మ జట్టు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ గిరిజ

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని గరుడబద్రలో దాతల సహకారంతో వారం రోజులుగా షైనింగ్ స్టార్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పీపీఎల్ (పంచాయతీల ప్రీమియర్ లీగ్) పోటీల్లో అదే గ్రామానికి చెందిన చింతల పోలమ్మ జట్టు విజేతగా నిలవగా.. పవర్ హిట్టర్స్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. ఈ మేరకు ఆదివారం రాత్రి విజేతలకు సర్పంచ్ గూడ గిరిజ చేతుల మీదగా నగదు బహుమతితో పాటు షీల్డ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతిభకు గ్రామీణ క్రీడలు వేదికగా నిలుస్తాయని అన్నారు. యువకులు చదువులో పాటు క్రీడలు పట్ల ఆసక్తి కనబర్చి ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు గూడ ఈశ్వరరావు, షైనింగ్ స్టార్ యువజన సంఘ అధ్యక్షులు వై.సతీష్, ఎం.చంద్రశేఖర్, ఉప సర్పంచ్ పార్వతి, వై.శ్రీను, ఎస్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



పరామర్శలో ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కంచిలి: కొక్కిలిపుట్టుగ, కుమ్మరిపేట గ్రామాల్లోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, పార్టీ నాయకులు ఆదివారం పరామర్శించారు. కొక్కిలిపుట్టుగ గ్రామానికి చెందిన పురుషోత్తంసాహు (76) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమారుడు ఖెత్రోసాహు, మిగతా కుటుంబసభ్యులను, కుమ్మరిపేట గ్రామానికి చెందిన బుదయా బెహరా (75) మృతిచెందగా.. ఆయన కుమారుడు, సచివాలయ సెక్రటరీ రమేష్ బెహరాను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. పరామర్శలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, జేసీఎస్ మండల కన్వీనర్ కొణపల సురేష్, బొగాబెణి సర్పంచ్ గణప సింహాచలం, కొక్కిలిపుట్టుగ పార్టీ నేత గంగాధర్ సాహు ఉన్నారు.

జంగిల్ క్లియరెన్స్

వజ్రపుకొత్తూరు: అమలపాడు పంచాయతీ ఉద్దానం నర్సింగపల్లి నుంచి ఉద్దానం రామక్రిష్ణాపురం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న జంగిల్‌ను ఆదివారం తొలగించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా యువజన విభాగం కార్యదర్శి, అమలపాడు సర్పంచ్ దున్న రత్నం బాలరాజు ఆధ్వర్యంలో 40 కిలో మీటర్లు మేర ఉన్న జంగిల్‌ను కూలీలతో తొలగించి వాహన చోదకులకు ఇబ్బంది లేకుండా చేశారు. తరచూ ఈ రహదారిపై మలుపులు వద్ద ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పనులు చేపట్టినట్లు తెలిపారు.



నర్సింగపల్లి రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్న దృశ్యం

యాంత్రీకరణతో అధిక దిగుబడులు



సీడ్ డ్రిల్ యంత్ర ప్రదర్శనను తిలకిస్తున్న రైతులు

సరుబుజ్జిలి: వ్యవసాయంలో యాంత్రీకరణ పద్ధతుల్లో సాగుచేస్తే మంచి దిగుబడులు వస్తాయని రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెవర మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని పాతపాడు గ్రామంలో పెట్టీకమ్ సీడ్ డ్రిల్ (యంత్రాలతో ఒకేసారి ఎరువులు, విత్తనాలు) విధానం గురించి రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్షేత్రస్థాయి ప్రదర్శనను ఆదివారం ప్రారంభించారు. వ్యవసాయంలో యంత్రీకరణ వలన కూలీల కొరత, పెట్టుబడి ఖర్చు, సమయం ఆదా అవుతుందన్నారు. ఫౌండేషన్ ఏరియా మేనేజర్ తవిటినాయుడు, కో ఆర్డినేటర్లు లావణ్య, రాజ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

నేడు మందసలో ఉచిత వైద్య శిబిరం

మందస: మందస ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు జెమ్స్ ఆస్పత్రి ఏరియా మేనేజర్ ఆర్.తిరుపతిరావు, అసిస్టెంట్ మేనేజరు బి.చిన్నారావు ఆదివారం తెలిపారు. పీహెచ్‌సీ వైద్యులు మద్దిల సంపత్‌రావు, టి.శైలజ ఆధ్వర్యంలో కార్డియాలజిస్ట్ బరాటం సాయితేజ, ఎండీ నెఫ్రాలజీ కె.రాకేష్ శిబిరంలో సేవలందిస్తారన్నారు. గుండె, కిడ్నీ సమస్యలతో పాటు ఇతర సమస్యలతో బాధపడే రోగులు శిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఈదురు గాలులతో నష్టం

మందస: ఉద్దాన ప్రాంతమైన లొహరిబంద, అంబుగాం, దున్నవూరు పంచాయతీల పరిధిలో ఇటీవల ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. చెట్లు నేలకొరిగాయి. ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. దీంతో చాలామంది నష్టపోయారు. లొహరిబంద పంచాయతీ పరిధిలో ఇళ్లు, రేకులషెడ్లు, పశువులశాలలో ఎగిరిపోయాయి. తాళ్ల రాధమ్మ ఇంటి పైరేకులు ఎగిరిపోవడంతో నష్టపోయానని.. ఆదుకోవాలని అధికారులను వేడుకుంటున్నారు. తాళ్ల జోగారావు, గొరకల భీమారావు, నర్తు మహలక్ష్మికి చెందిన పశువుల శాలలు ఎగిరిపోవడంతో నష్టపోయారు.

నేడు సోంపేటలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీ సచివాలయం-1 పరిధిలో సోమవారం సాయంత్రం ఐదు గంటల నుంచి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి నాయకులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

టెన్త్ టాపర్ బాలవర్ధన్‌కు అభినందన

మందస: కుంటికోట గ్రామానికి చెందిన మానిమి బాలవర్ధన్ 583 మార్కులతో టాపర్‌గా నిలిచాడు. మహాత్మాజ్యోతిబాపూలే మత్స్యకార గురుకులంలో చదివిన బాలవర్ధన్‌కు రాష్ట్రస్థాయిలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, మహాత్మాజ్యోతిబాపూలే మత్స్యకార గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ అనంతరాం చేతుల మీదుగా మెమెంటోతో పాటు సన్మానం పొందాడు. శ్రీకాకుళంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో రూ.50 వేల నగదు, గోల్డ్‌మెడల్‌ను అందుకున్నాడు. సర్పంచ్ దుంపల వైకుంఠరావు ఆధ్వర్యంలో బాలవర్ధన్‌ను కుంటికోటలో ఆదివారం సన్మానించారు.

నేడు బ్రాహ్మణతర్లాలో ఆధ్యాత్మిక సభ

కాశీబుగ్గ: పలాస మండలం బ్రాహ్మణతర్లా గ్రామంలోని దివ్యజీవన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆధ్యాత్మిక మహాసభ నిర్వహిస్తున్నట్లు సంఘ సభ్యులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపడతామన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేస్తామన్నారు.

మూలిపాడులో అభివృద్ధి పనులు



రోడ్డు పనులు చేయిస్తున్న దృశ్యం

మందస: మూలిపాడు గ్రామంలో సర్పంచ్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గుసిరి వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం పలు అభివృద్ధి పనులు చేపట్టారు. శ్మశానవాటిక రహదారిని బాగు చేశారు. పారిశుద్ధ్యం పనులు నిర్వహించారు. మరమ్మతులకు గురైన మంచినీటి పథకాన్ని బాగు చేయించి సమస్యను పరిష్కరించారు. మహేంద్రతనయ నదికి వెళ్లే మార్గం కోతకు గురికావడంతో సిమెంట్ కాలువల నిర్మాణం చేపట్టి, వాటిని కూడా పూర్తి చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామచంద్రచౌదరి, మాజీ సర్పంచ్ గౌరహరోమహంతి, పార్టీ నాయకులు యర్నాగుల శ్రీనివాసరావు, దట్టి నీలయ్య, నగిరి విశ్వనాథం, తెంబ అప్పలస్వామి, కోదండరావు పాల్గొన్నారు.

కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం

టెక్కలి రూరల్: ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం పొందాలంటే కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని సమతా సైనికదళ్ జిల్లా కన్వీనర్ చల్లా రామారావు అన్నారు. స్థానిక వైఎస్ఈఎస్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజురోజుకు పెరుగుతున్న పోటీ ప్రపంచంలో కంప్యూటర్ ఆవశ్యకం తప్పనిసరన్నారు. సంస్థ డైరెక్టర్ పిలక చంటి ఆధ్వర్యంలో టైపింగ్ పోటీలు నిర్వహించగా.. సీపాన కామాక్షి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈమెకు రూ. పది వేల చెక్కుతో పాటు షీల్డును, సెమినార్ పోటీల్లో విజేతలుగా నిలిచిన బమ్మిడి కవిత, యర్ర నవదీప్‌లకు షీల్డును అందజేశారు. కార్యక్రమంలో కోడైరెక్టర్ పి.దివ్య పాల్గొన్నారు.

ఎంఈవో-2గా చిన్నారావు

టెక్కలి రూరల్: టెక్కలి ఎంఈవో-2గా దాసుపురం చిన్నారావు నియమితులయ్యారు. లింగాలవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేసిన ఈయన్ని పదోన్నతుల్లో భాగంగా మండల విద్యాశాఖాధికారి-2 గా అధికారులు ఎంపిక చేశారు. ఎంఈవో-1గా దాసరి నాగభూషణరావు వ్యవహరిస్తున్నారు. చిన్నారావు నియామకంపై పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ కార్యవర్గ సభ్యులు చిలుకు కృష్ణారావు, హరిబాబు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కోటబొమ్మాళి ఎంఈవో-2గా ఎల్.వి.ప్రతాప్



విశ్వప్రతాప్

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ఎంఈవో-2గా లఖినాన విశ్వప్రతాప్ నియమితులయ్యారు. ఈ మేరకు విశాఖపట్నం ప్రాతీయ విద్యాశాఖాధికారి జ్యోతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన కోటబొమ్మాళి బాలుర హైస్కూల్ హెచ్‌ఎంగా ప్రస్తుతం పని చేస్తున్నారు.

రైతు ఉత్పత్తిదారులకు సాయం



మాట్లాడుతున్న ప్రసాదరావు

మందస: రైతు ఉత్పత్తిదారులకు ప్రభుత్వం సాయం అందిస్తోందని సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ గొడబ ప్రసాదరావు చెప్పారు. ఉద్దాన ప్రాంతమైన బహడపల్లి పంచాయతీలో ఇంటిగ్రేటెడ్ ఫార్మింగ్ క్లస్టర్ (సమీకృత వ్యవసాయ విధానం)పై ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి కుటుంబానికి ఐదు నుంచి పది వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలోపేతం చేయడమే ఐఎఫ్‌సీ ఉద్దేశమన్నారు. 250 నుంచి 300 కుటుంబాలను ఒక ఐఎఫ్‌సీ క్లస్టర్‌గా ఎంపిక చేసుకోవాలన్నారు. మండలంలోని మొత్తం సమీకృత వ్యవసాయం సాగు చేయడానికి ప్రస్తుతం ఎఫ్‌పీఓ ద్వారా ఈ విధానం అమలు చేయడం జరుగుతోందన్నారు. సంవత్సరం పొడవునా ఆదాయం వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. రైతులకు తక్కువ స్థలంలో ఏడాది పాటు లాభసాటి సాధారణ, వాణిజ్య పంటలను పండిస్తూ నిరంతరం ఆర్థికంగా, సామాజికంగా, అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఈ పథకం అమలు చేసిందన్నారు. పండ్లు, పూలు, కూరగాయలు, డెయిరీ ఫా, చేపల పెంపకం, గొర్రెలు, కోళ్లు, వ్యర్థాల నుంచి కంపోస్టు, పొలాల చుట్టూ మునగ, బొప్పాయి తదితర పంటలు వేసుకోవాలన్నారు. అవసరమైన నిధులు బ్యాంకుల ద్వారా, స్త్రీనిధి, ఉన్నతి, సీడ్ కేపిటల్, ఎఫ్‌పీఓ తదితర వనరుల నుంచి సేకరించాలన్నారు. కార్యక్రమంలో వీవో అధ్యక్షురాలు తేజావతి, వీవోఏ మాధవ్, రైతు ఉత్పత్తిదారుల సంఘాల లీడర్స్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పేపర్ ప్రకటన

భూమి కౌలు హక్కు టెండర్ -కం-బహిరంగ వేలం ప్రకటన- దేవదాయ - ధర్మదాయ శాఖ

శ్రీకాకుళం జిల్లా, టెక్కలి మండలం, టెక్కలి గ్రామములో వేంచేసియున్న శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దేవస్థానం కోడ్: 21296 నకు సంబంధించి నందిగాం మండలం కణితివూరు, టెక్కలి మండలం లింగాలవలస గ్రామములలో కింది వివరించిన సర్వే నెం లలో గల భూమిని 3 సం॥కాలం నకు అనగా 2023 -24 సంవత్సరం నుండి 2025-26 సం॥ కాలము వరకు కౌలు హక్కు కొరకు, దేవదాయ శాఖ అధికారులు మరియు గ్రామస్తులు సమక్షములో సదరు భూములు ఉన్న గ్రామం వద్ద క్రింది వివరించిన తేదీలు మరియు సమయం నందు టెండర్ కం బహిరంగ వేలం పాట జరుపబడును.

వ నెం.	భూమియున్న గ్రామం	సర్వేనెం.	య.సెం	భూమి వివరం	పాట తేది, సమయం	పాట జరుగు ప్రదేశం	ధరావత్తు
1	కణితివూరు	44/1,44/2,44/3,44/10బి, 11బి,44/11ఎ3సి,44/5ఎ,5బి, 44/6,44/7,44/7సి,44/8	22.57	పల్లం	తే05.07.2023ది ఉ॥ గం॥ 10.30 ని॥లకు	భూములు ఉన్న గ్రామం	బిట్ ఒక్కింటికి 500/-
2	లింగాలవలస	365/1,415/2,416/10 417/9,418/3,5,6,425/4,6, 426/10,11,432/2,4,328/8, 10,329/5,11,353/79,463/1 393/7,8,395/5,465/2,3, 466/9,16,358/9,365/6,11 367/6,8,398/8,439/4,7 449/2,5,417/1,389/3 472/5,445/10	14.13	పల్లం, మెట్టు	తే05.07.2023ది మధ్యాహ్నం గం. 3.00 ని॥లకు	భూములు ఉన్న గ్రామం	బిట్ ఒక్కింటికి 500/-

పాట షరతులు ఆలయ కార్యాలయం పనిచేయు వేళలో అడిగి తెలిసికొనగలరు.

టెక్కలి

తేది: 18.06.2023 సం/- వి.వి. సూర్యనారాయణ, కార్యనిర్వహణాధికారి, టెక్కలి

భక్తిశ్రద్ధలతో నీలమ్మతల్లి 26వ వార్షికోత్సవం



అమ్మవారికి ఘటాలను సమర్పిస్తున్న భక్తులు

సరుబుజ్జిలి: మండలంలోని మతలబుపేట గ్రామంలో గల నీలమ్మతల్లి పేరంటాల 26వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామంలోని మహిళలంతా కలిసి ఘటాలతో ముర్రాటలు సమర్పించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, అర్చనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజల్లో పలు గ్రామాల భక్తులు భారీగా పాల్గొన్నారు.